క్లుప్తంగా

మూలస్థాన ఎల్లమ్మకు పొంగళ్లు



ఊరేగింపుగా ఆలయానికి వస్తున్న భక్తులు

చంద్రగిరి : గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మతల్లికి భక్తులు సామూహిక పొంగళ్లను శుక్రవారం సమర్పించారు. ఈ సందర్భంగా రెడ్డివారిపల్లె పంచాయతీ ఎగువ రెడ్డివారిపల్లెవాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అమ్మవారికి పొంగళ్లు పొంగించి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మహిళా వర్సిటీలో 'ఆప్కో' ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

తిరుపతి రూరల్: పద్మావతి మహిళా వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఆప్కో మెగా ఎగ్జిబిషన్‌ను వీసీ ప్రొఫెసర్ ఉమ శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ చేనేత వస్త్రాలు భారత సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు 30శాతం డిస్కౌంట్‌తో ఎగ్జిబిషన్ కొనసాగుతుందని వెల్లడించారు. రిజిస్ట్రార్ రజని, ప్రొఫెసర్ సావిత్రి, పీఆర్‌ఓ డాక్టర్ రజని, చేనేత, జౌళి శాఖ ఏడీ రమేష్, ఆప్కో మండల వాణిజ్య అధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



సుభాష్‌చంద్రబోస్ దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓలు

పాకాల : మండలంలోని కుందేటివారిపల్లె ఎంపీపీ పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు సుభాష్‌చంద్రబోస్‌ను ఘనంగా సత్కరించారు. శుక్రవారం స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో ఎంఈఓ బాబ్జీ మాట్లాడుతూ సుభాష్‌చంద్రబోస్ సేవలను కొనియాడారు. ఎంఈఓ–2 లింగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని చదువుకు చేయూత



వెన్నెలకు నగదు అందిస్తున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల : ఎస్‌వీఎస్ పాఠశాల పూర్వ విద్యార్థిని వెన్నెల ఇంజినీరింగ్ చదువుకు శ్రీలక్ష్మీ సరస్వతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వారు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం ఈ మేరకు ఎంఈఓ బాబ్జీ చేతుల మీదుగా రూ.10వేలను అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ వెన్నెలకు అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పించిన ప్రధానోపాధ్యాయుడు మోహన్ తన ఆధ్వర్యంలోని ట్రస్ట్ ద్వారా చేయూతనందించడం అభినందనీయమని తెలిపారు.

గిరిజన హక్కుల రక్షణే లక్ష్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీపీఎస్ నేతలు

తిరుపతి కల్చరల్: గిరిజన హక్కుల రక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జీపీఎస్ జాతీయ అధ్యక్షుడు, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గిరిజనులను చైతన్యవంతం చేసేందుకు యాత్ర సాగిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో నేటికీ లక్షలాదిమంది గిరిజనులు దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. నేతలు రాజు నాయక్, హనుమంతు నాయక్, ఎండీ మంజు కుమార్ నాయక్, తేజ నాయక్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుట్కా అమ్మకంపై ఆగ్రహం



ప్రిన్సిపల్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల క్యాంటీన్‌లో సిగరెట్లు, గుట్కాలు అమ్మడం దారుణమని భారతీయ దళిత విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం దళిత సంఘాల నేతలతో కలసి కళాశాల క్యాంటీన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల క్యాంటీన్‌లో మత్తుపదార్థాల విక్రయంపై టీటీడీ అధికారులు, ప్రిన్సిపల్ చర్యలు తీసుకోకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. నేతలు సుకుమార్, వినుత పాల్గొన్నారు.

అవినీతికి అభిషేకం

తిరుచానూరులో సిరులతల్లి సేవను సామాన్యులకు దూరం చేస్తున్నారు. ప్రధానంగా అభిషేక టికెట్లను ఆలయ అధికారులు ఆదాయ వనరుగా మార్చేసుకున్నారు. అందులో భాగంగా ఆఫ్‌లైన్‌లో మంజూరు చేసే టికెట్లను అయిన వారికే కేటాయిస్తున్నారు. ఇందుకోసం వేలా దిరూపాయలు వసూలు చేస్తున్నారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి కాకుండా కాసులు ముట్టజెప్పిన వారికే ప్రాధాన్యమిస్తున్నారు. దళారీలుగా మారిన ట్రావెల్ ఏజెంట్ల సహకారంతో యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. మొత్తం వ్యవహారం గమనించిన ఓ భక్తుడు ఆవేదనతో ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. అమ్మవారి అభిషేక సేవలో సైతం అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

- పద్మావతి అమ్మవారి ఆలయంలో అధికారుల దందా
- బ్లాక్‌లో అభిషేకం సేవా టికెట్లు
- అధిక ధరలకు విక్రయం
- పట్టించుకోని విజిలెన్స్
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన భక్తుడు



తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తిరుమల శ్రీవారి తర్వాత అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుచానూరు. శ్రీవారి పట్టపురాణి అలమేలు మంగమ్మ దర్శనార్థం దేశవిదేశాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. తిరుమల శ్రీవారి దర్శనం తర్వాత సామాన్య భక్తుడి నుంచి వీవీఐపీ వరకు అమ్మవారిని సేవించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో తిరుమల తరహాలోనే పద్మావతీదేవికి నిత్య, వార, పక్ష, మాస, వార్షిక ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ప్రధానంగా శుక్రవారం రోజున అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతుంటారు. ఈ క్రమంలో వేకువజామున శ్రీవారి దేవేరి అభిషేక సేవను వీక్షించేందుకు వీఐపీలు సైతం పోటీపడుతుంటారు. సామాన్య భక్తులైతే అమ్మవారి అభిషేక సేవలో తరించేందుకు తహతహలాడుతుంటారు. ఇంతటి ప్రాముఖ్యత ఉండడంతో అభిషేక సేవ టికెట్లకు భారీగా డిమాండ్ ఉంది. ఇదే ఆసరాగా తీసుకుని ఆలయంలోని కొంత మంది ఉద్యోగులు భారీగా అభిషేక టికెట్లతో దందా చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలకు నీళ్లు

పద్మావతి అమ్మవారి అభిషేక టికెట్ల కేటాయింపు నిబంధనలకు ఆలయ అధికారులు నీళ్లొదిలేశారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అభిషేక టికెట్‌ను ఆఫ్‌లైన్ ద్వారా పొందేందుకు భక్తులు ముందు రోజు అంటే గురువారం ఉదయం 10 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలా దరఖాస్తు చేసుకున్న వారికి సాయంత్రం 5 గంటల లోపు టికెట్ జారీ చేస్తారు. అయితే అభిషేక టికెట్ కోసం మొదటగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా తమకు నగదు ముట్టజెప్పిన వారికి ఇష్టానుసారంగా టికెట్లను జారీ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా ప్రతి వారం 10 నుంచి 20 టికెట్లను బ్లాక్‌లో విక్రయిస్తూ, అమ్మవారి ఆలయ ప్రతిష్టను దిగజార్చుతున్నారని కొందరు ఆలయ ఉద్యోగులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దళారీలకు విక్రయం..?

శ్రీవారి దేవేరి అభిషేక టికెట్లను కొందరు అధికారులు తిరుపతిలోని ట్రావెల్స్ ఏజెంట్లకు, దళారులకు అధిక ధరలకు ఇస్తున్నారని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఓ ట్రావెల్స్ నిర్వాహకుడు ఈ క్రమంలోనే ఓ అధికారి విహార యాత్రలకు వాహనాలను సమకూర్చడం, ఇతర ప్రాంతాలకు ఉచితంగా పంపించడం వంటివి చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దళారీలకు సైతం రూ.500 అభిషేక సేవా టికెట్‌ను రూ.2వేల నుంచి రూ.5వేల వరకు అమ్ముతున్నట్లు సమాచారం.

అందుబాటులో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టికెట్లు

అమ్మవారి అభిషేక సేవ టికెట్లను టీటీడీ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాలుగా భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆన్‌లైన్‌లో 30 టికెట్లు, ఆఫ్‌లైన్ ద్వారా ఆలయం ముందు భాగంలోని కౌంటర్‌లో 30 నుంచి 35 టికెట్ల వరకు ప్రతి వారం జారీ చేస్తుంది. భక్తులు అభిషేక టికెట్లు కావాలనుకుంటే నేరుగా ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఆఫ్‌లైన్‌లో ఇచ్చే టికెట్లలో అధికారులు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఫిర్యాదు చేసిన భక్తుడు

అమ్మవారి అభిషేక టికెట్ కోసం ఓ భక్తుడు ఇటీవల ఆఫ్‌లైన్ ద్వారా మొదటి దరఖాస్తు అందజేశాడు. అయితే అధికారులు అతని దరఖాస్తును వరుస సంఖ్య 7లో ఉంచి, ఆలస్యంగా టికెట్ జారీ చేశారు. ఆలయంలో టికెట్లను అక్రమ మార్గాల్లో విక్రయిస్తున్నారంటూ తనకు జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులకు సదరు భక్తుడు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లుగా తెలిసింది.

నిర్లక్ష్యం మాటున విజిలెన్స్..!

కొంత కాలంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో కొంత మంది ఉద్యోగులు సేవా టికెట్ల దందా కొనసాగిస్తున్న క్రమంలో విజిలెన్స్ అధికారులు గుర్తించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆలయ భద్రతతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టడం, అక్రమాలకు తావులేకుండా నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచడం టీటీడీ విజిలెన్స్ పని. అయితే అవేమి పట్టించుకోకుండా విజిలెన్స్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో ఆలయ ఉద్యోగుల దందా మూడు పువ్వులు..ఆరుకాయలుగా కొనసాగుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అభిషేక టికెట్ల దందాపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని, అవినీతికి చెక్ పెట్టాలని కోరుతున్నారు.

కబ్జా నుంచి కాపాడాలని వినతి

తిరుపతి క్రైమ్: తిరుమలలోని తమ ఇంటిని కబ్జా చేసిన వారి నుంచి కాపాడాలని తిరుపతికి చెందిన ఆర్.సుధీర్ అనే బాధితుడు ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు విన్నవించారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీకి వినతి పత్రం అందించాడు. బాధితుడు మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆలయం సమీపంలోని సాదూరుమఠం సందులో టీటీడీ 1977 సంవత్సరంలో ఇంటిని కేటాయించిందన్నారు. అయితే ఆ సమయంలో తమ తండ్రికి చిన్న వయసు కావడంతో మేనత్త కె.సుబ్బరత్నమ్మ పేరుతో ప్రొసీడింగ్ ఇచ్చారని వెల్లడించారు. ఆమెకు పిల్లలు లేకపోవడంతో చివరి వరకు తామే చూసుకున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే ఆమె తనతోపాటు మరో మేనత్త జయమ్మ కుమారుడు శ్రీధర్‌కు ఇల్లు చెందాలని వీలునామా రాసిందని వివరించారు. అయితే మేనత్త జయమ్మ కుమార్తె విజయలక్ష్మి, ఆమె భర్త నాగభూషణం దౌర్జన్యంగా ఇంటిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. కబ్జాదారులపై చర్యలు తీసుకుని తమ ఇంటిని అప్పగించేలా ఆదేశాలు జారీ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎస్పీ మాట్లాడుతూ విచారణ చేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నేడు శ్రీవారి సేవకు కేంద్ర మంత్రి



కేంద్రమంత్రికి స్వాగతం పలుకుతున్న అదనపు ఈఓ

తిరుమల: తిరుమల శ్రీవారిని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శనివారం దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్నా ఆయనకు టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

నిరాశ్రయులకు పక్కాగా వసతులు

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక కేంద్రాల్లో నిరాశ్రయులకు పక్కాగా వసతులు కల్పించాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో షెల్టర్ ఫర్ అర్బన్ హోమ్ లెస్ కౌన్సిల్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. పట్నూల్ వీధిలో షెల్టర్ నిర్వహణ బాధ్యతను తీసుకునేందుకు అమ్మ ఫౌండేషన్ ముందుకు వచ్చిందని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు డీసీపీ ఖాన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, సీఎంఎంలు కృష్ణవేణి, సోమ కుమార్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

గణపతి విగ్రహ ఏర్పాటుకు వినతి

వినాయక సాగర్ మధ్యలో నాట్య గణపతి విగ్రహం ఏర్పాటు చేయాలని వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కోరింది. శుక్రవారం ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ మౌర్యకు వినతిపత్రం అందించింది. అలాగే వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని విన్నవించింది.

ప్రత్యేకం.. వెంగమాంబ స్థానం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తెలుగులోసహజ కవయిత్రిగా, యోగినిగా, భక్తురాలిగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ స్థానం ప్రత్యేకమని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్ తెలిపారు. వెంగమాంబ 208వ వర్ధంతిని పురస్కరించుకుని అన్నమాచార్య కళామందిరంలో శుక్రవారం సంగీత కచేరి, సాహితీ సదస్సు నిర్వహించారు. మేడసాని మాట్లాడుతూ వెంగమాంబ ఆశువుగా చెప్పిన పద్యాలు, శ్లోకాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఆచార్యులు డాక్టర్ వీఆర్ రాసాని మాట్లాడుతూ నిరక్షరాస్యులు సైతం అర్థం చేసుకునేలా సంకీర్తనల ప్రక్రియను ఎంచుకున్నారని కొనియాడారు. డాక్టర్ కొణిదల శోభ, డాక్టర్ తొండాటి రాజశేఖర్ తదితరులు వెంగమాంబ విరచిత రమా పరిణయం అనే అంశంపై మాట్లాడారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు ఆర్. సుశీల, కుమారి కోనేరు లక్ష్మీరాజ్యం సంగీత కచేరి నిర్వహించారు. సాయంత్రం జి. లావణ్య, పి. శ్రీనివాస కుమార్ బృందం సంగీత కచేరి చేపట్టారు. తరిగొండ వెంగమాంబ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి కె.రాజగోపాలరావు, అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.లత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేడసాని మోహన్

కానిస్టేబుల్స్ ఫలితాలలో వివేక్ ప్రభంజనం

తిరుపతి సిటీ : స్థానిక ప్రకాశం రోడ్డులోని వివేక్ కోచింగ్ సెంటర్ శిక్షణ పొందిన అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెయిన్స్ పరీక్ష ఫలితాలలో సుమారు 23 మంది టాప్ మార్కులు సాధించారని ఆ సంస్థ డైరెక్టర్ శివయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 200 మార్కులకు సుమారు 20 మందికి పైగా 144 మార్కులకు పైగా సాధించి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. సంస్థ లాభాపేక్షతో కాకుండా అభ్యర్థుల జీవితాలలో వెలుగులు నింపేందుకు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు.



ఈఎస్‌ఐ ఆస్పత్రిలో..



చంద్రగిరి : మాట్లాడుతున్న వైద్యాధికారి యుగంధర్

అమ్మపాలు అమృతం

నగరంలోని ఈఎస్‌ఐ, ఎస్వీ వైద్యకళాశాల, రుయా, చంద్రగిరి ఆర్‌హెచ్‌సీ ఆస్పత్రిలో శుక్రవారం ఘనంగా తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. అమ్మపాలు అమృతమని వక్తలు వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని సూచించారు. తల్లిపాలు పట్టిస్తే శిశువుకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని వెల్లడించారు.

తిరుపతి తుడా/చంద్రగిరి

శ్రావణం.. మహిళలకు మంగళకరం



పూజలు చేస్తున్న మహిళలు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : శ్రావణమాసం మహిళలకు మంగళకరమని యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎస్.ప్రసాద్ తెలిపారు. రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో కెనడీ నగర్‌లోని అంకాళమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ శ్రావణమాసంలో ఉపవాస దీక్షను పాటిస్తూ పరమేశ్వరుని బిల్వ పత్రాలతో పూజిస్తే సమస్త గ్రహ దోషాలు తొలగుతాయని వెల్లడించారు. అనంతరం వృద్ధులకు చేతికర్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు.చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. రాస్ సిబ్బంది సత్యనారాయణ, చంద్రకళ, వాణి, భార్గవి, కవిత పాల్గొన్నారు.

సంస్కృతి రక్షణ అందరి బాధ్యత



కళాకారులను సత్కరిస్తున్న అధ్యాపకులు

పాకాల : తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రధానంగా విద్యార్థులు ఆ దిశగా ముందుకు సాగాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.రెడ్డిరామరాజు తెలిపారు. శుక్రవారం కళాశాలలో తిరుపతికి చెందిన మన సంస్కృతి కళా సంస్థ ఆధ్వర్యంలో జానపద పాటల కార్యక్రమం నిర్వహించారు. కళాకారులు పాటల రూపంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళా సంస్థ ప్రధాన కార్యదర్శి కె.రెడ్డెప్ప, ఆర్గనైజర్స్ డాక్టర్ ఆమూరి సుబ్రమణ్యం, వి.జగన్‌మోహన్ పాల్గొన్నారు. అనంతరం కళాకారులను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

73 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : నగరంలో మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న ఆరుగురికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. అలాగే నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిస్తున్న 67 మంది చిరువ్యాపారులకు రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి తీర్పు చెప్పారు.

న్యాయవాది లక్ష్మన్న ఫొటో ఆవిష్కరణ

తిరుపతి లీగల్ : తిరుపతి న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు, దివంగత ఊటుపల్లి లక్ష్మన్న చిత్రపటాన్ని బార్ అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. న్యాయవాది వెంకట కుమార్ పర్యవేక్షించారు.

జూడోలో ఎంజీఎం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తిరుపతి సిటీ : శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం నిర్వహించిన సబ్ జూనియర్ జూడో పోటీలలో బైరాగి పట్టెడలోని మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 10వ తరగతి విద్యార్థి ఎన్.యుగేంద్ర గోల్డ్ మెడల్ సాధించగా, 9వ తరగతి విద్యార్థులు ఎన్.చరణ్, సి.కృష్ణ సిల్వర్ మెడల్ అందుకున్నారు. అలాగే ధరణీపతి, ఆర్.హరి, పి.వంశీ, వి.దాదా, ఎన్.చరణ్ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు పరంధామనాయుడు అభినందించారు.

11న ఎస్పీడీసీఎల్ వద్ద ధర్నా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11వ తేదీన ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతున్నట్లు సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.వెంకటరత్నం తెలిపారు. శుక్రవారం ఈమేరకు ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు వస్తే ప్రజలు ముందుగానే డబ్బులు చెల్లించి కరెంటును కూడా రీచార్జ్ చేసుకోవాల్సిన దుస్థితి దాపురిస్తుందని మండిపడ్డారు. ఈ విధానంతో కార్పొరేట్ కంపెనీలకు రూ.23లక్షల కోట్లు అడ్వాన్స్ రూపంలో చేరుతుందని ఆరోపించారు. అదానీ కంపెనీ ద్వారా మన ఇంట్లోని మీటర్లను ఆపరేట్ చేస్తారని విమర్శించారు. సమావేశంలో నేతలు విజయకుమార్, మణి, రవి, హుస్సేన్, హరి, రాంబాబు, చిరంజీవి, బాషా, బాలకృష్ణ, ఉదయ్, అభిరామ్, మోహిత్ ,రాఘవేంద్ర వేమయ్య పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామి ఆలయ మాడ వీధుల్లో ఉదయం 4.45 గంటలకు నగర సంకీర్తన.
- ఏపీ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద ధర్నా.
- మోహన్‌బాబు యూనివర్సిటీలోని ఇండోర్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు స్నాతకోత్సవం.
- పద్మావతి మహిళా వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆప్కో మెగా ఎగ్జిబిషన్.
- తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు మండల మీట్.
- తరిగొండ వెంగమాంబ వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా ఉదయం 9 గంటలకు ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లోని వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి, 10.30 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో సంగీత కచేరి, 11.30 గంటలకు హరికథ, సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు.
- రేణిగుంటలోని ఐఎంఎల్ డిపో వద్ద ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ శాఖ సీజ్ వాహనాలకు వేలం పాట.
- శ్రీకోదండరామాలయంలో ఉదయం 6 గంటలకు స్వామివారికి అభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు ఊరేగింపు.

అక్రమం



పేరూరు పంచాయతీ జీవోస్ కాలనీ మెయిన్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా ఆరు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఇందులో సెట్ బ్యాక్‌తోపాటు ఫైర్ సేఫ్టీ నియమాలను సైతం పూర్తిగా విస్మరించారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్లాట్లలోని వారి ప్రాణాల మీదకు వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కళ్లెదుటే అక్రమ నిర్మాణం సాగుతున్నప్పటికీ తుడా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా ఈ బిల్డింగ్‌కు సమీపంలోనే మరో కట్టడాన్ని సైతం రోడ్డు స్థలం ఆక్రమించి పనులు సాగిస్తున్నారు.

\- తిరుపతి తుడా